# ఏంచెయ్యమంటారు?

చెళ్ళూరి సీతారాజేశ్వరరావు

ఆగస్టు 9.

ఆదివారం యివాళ. ప్రొద్దుటినుంచీ ముసురు. పెద్దగా వర్షం లేకపోయినా తుప్పర పడుతోంది. అంతా తడిసి వుండటంతో చిరాకుగావుంది. నా గదిలో కాలక్షేపం చేద్దామా అంటే దాన్ని పెద్దబావ ఆక్రమించాడు. ఇల్లంతా పిల్లలతో గోలగా వుంది అమ్మకి తెల్లవారు ఝామునుంచీ వంటింటిలో వూపిరి తిరగని పని. పిల్లల్ని కసురుకోవడంతో ఆమె ఎంత అలసటగా వుందో అర్థమైంది. ఏమిటో ఈ వేడుకలు అర్థం లేకుండా? ఆరోసారి కూడ బావకి బారసాల మీద మోజే. నాన్న రిటైరయ్యారని తెలిసికూడ బావ గ్రహించలేదు. వేళాకోళంగా నేనంటే 'మీ నాన్నగారు రిటైరయినా నువ్వు సంపాదిస్తున్నావు కదా. ఇక అల్లుళ్ళ మర్యాద నీదే' అన్నాడు. మూర్ఖ మనిషి. ఇంట్లో తోచక తొమ్మిదిన్నరకి వేదాచలం రూంకెళ్ళాను. బ్రహ్మచారి గది పేకాట జనంతో విందుగావుంది. పన్నెండున్నర దాకా నేను చెయ్యి కలిపాను. ఈలోగా యింటి దగ్గర్నుంచి కబురు వచ్చింది.

దారిలో యింగ్లీషు హెడ్ పార్వతీశం కనిపించి "దాన్నేం చేశావు?" అనడిగారు.

"ఏం చెయ్యాలో మీరే చెప్పండి." అన్నాను ఎదురుగా. ఆయన ప్రశ్నతో నాలుగు రోజులనాటి సంగతి గుర్తువచ్చి మనస్సు చివుక్కుమంది. క్లాసు జరుగుతూండగా శ్రీహరి సెక్స్ అట్లాసు తన మిత్రులకి చూపించి గోలచేస్తున్నాడు. వార్నింగ్ యిచ్చాను. వృథా అయింది. శ్రీహరి వెటకారంగా మాట్లాడాడు. క్లాసుకి రావద్దని చెప్పేసాను. అది ప్రిన్సిపాల్ దగ్గరకెళ్ళింది. శ్రీహరి మినిస్టర్‌గారి గారాలపట్టి కనుక తప్పు తనదేనన్నట్లు మాట్లాడాడు.

"గోడమీదబొమ్మలాతప్పుకోవాలోయ్ ఏదో క్లాసు అయిందనిపించి బయటికి రావడమే మనపని. అల్లరి మూకతో మనకెందుకోయ్?"

పార్వతీశంగారివల్ల వ్యవహారం బిగిసిపోయిందని తెలిసింది. నేను అపాలజీ యివ్వకపోతే సమ్మెచేస్తారుట. ఇంటికి వచ్చినా మనస్సు గందరగోళంగావుంది. ఉద్యోగంలో చేరిన నాలుగు నెలలకే అందరి నోట్లోకి వచ్చేశాను.

ఆగస్టు 10.

లేచేసరికి తొమ్మిదయింది. ఇవాళ కాలేజీ తెరుస్తారు. హడావిడిగా తయారయ్యాను. భోజనం చెయ్యాలనిపించ

లేదు. కాఫీ త్రాగి సైకిల్ ఎక్కాను.

డిపార్టుమెంటులోకి రాగానే అందరికళ్లు నా మీదేవున్నాయి. పేపరు తిరగవేస్తూ కూర్చున్నాను అందరూ తప్పు నాదేనన్నట్లు ఒప్పుకుని తీరా లన్నట్లు మాట్లాడుతున్నారు కాలం ఎంతగా మారి పోయింది? తప్పుచేసిన విద్యార్థిని గురువు దండించకూడదు.



ఇంతలో ప్రిన్సిపాల్‌గారి దగ్గర్నుంచి కబురువచ్చింది. ఆయన ప్రయివేటు గదిలో మేథమేటిక్స్ హెడ్ సత్యనారాయణ ఫిజిక్స్ లెక్చరర్ దామోదరంవున్నారు. వాళ్లు ఆయనగారి కుడిభుజాలు. ఆ యిరువురు ప్రక్కన లేనిదే ఏ విషయమూ పరిష్కరించలేడాయన.

"టేక్ యువర్‌సీట్ మిస్టర్ దినకర్.... శ్రీహరి చాలా పట్టుదలగా వున్నాడు. సమ్మెదాకా పోనివ్వడమెందుకు చెప్పు? అపాలజీ రాసేయ్ గొడవ తప్పుతుంది. వాళ్ళది బాధ్యత తెలియని వయస్సు. మనమే దిగి రావాలోయ్!" దామోదరం అన్నాడు.

"అపాలజీ అంటే శిక్ష. దేనికి? నా నేరం ఏమిటో చెప్పండి సార్? ఇది జరిగాక యిక నా పరువుంటుందా? క్లాసులో పిల్లలకి పాఠాలు చెప్పగలనా? ఉపాధ్యాయుడి పరువుకంటె విద్యార్థి పట్టుదలే ముఖ్యమా సార్?"

"ఈ వాదాలతో యిన్నాళ్లు గడిచి పోయాయి. కుర్రాళ్ళని యిక ఆపలేం. వాళ్లు సమ్మెచేస్తే చీఫ్ మినిస్టర్ దాకా పోతుంది. మన సంస్థ రోడ్డెక్కుతుంది. ప్రిన్సిపాల్‌గారికి చెడ్డపేరు వస్తుంది" సత్యనారాయణ హితవు చెప్పారు.

"చూడబ్బాయ్.... నువ్వింకా కుర్రాడివి. యూనివర్సిటీ గేటు మొన్ననే దాటావు. లోకం పోకడ నీకు తెలియదు. శ్రీహరి నాన్న మన కాలేజీ కమిటీ ప్రెసిడెంటు. ఆయనకి పవరుంది. దానికి మనం భయపడాలి. తప్పడడుగు వేశావా అనక విచారించవలసి వుంటుంది." అన్నారు ప్రిన్సిపాల్.

"నేను అపాలజీ చెప్పి తీరాలన్న మాట."

ముగ్గురూ తల ఆడించారు.

"అలా ఆత్మవంచన చేసుకోలేను. మీకు పదవులు, అధికారాలు అంటే భయం. తప్పుచేసిన శ్రీహరిని మీరు సమర్థించగలరు. ఎందుకంటె అతడికి డబ్బుంది. పవరున్న నాన్నవున్నాడు. విద్యార్థి యూనియన్ బలముంది. నేను ఏకాకిని. నా వర్గం మనుషులే నన్ను సమర్థించడానికి రారు ..థాంక్స్ సార్ . థాంక్స్ టు ఆల్"

రాజీనామా యిచ్చివేశాను. వాళ్లు నిర్ఘాంతపోయారు.

ఆగస్టు 11.

నేను వుద్యోగం మానివేసినట్లు నాన్నకి తెలిసింది. నాన్న నాకు నచ్చ చెప్పాలని చూశారు నేనేం మాట్లాడ లేదు. చీకటి పడేదాకా యింటినించి కదల్లేదు "ఉద్యోగం మానేశావుట ..." అంటూ పరామర్శలు వస్తాయని.

రాత్రి పడయ్యేదాకా చెరువుగట్టుమీద ఏకాంతంగా కూర్చున్నాను. మళ్ళీ నిరుద్యోగినయిపోయాను. మళ్ళీ వాంటెట్ కాలమ్స్ వెతగాలి. ఈ రోజుల్లో వుద్యోగం దొరకడమంటే మాటలా?

ఆగస్ట్ 13.

పెద్దక్క పిల్లలు వెళ్ళిపోయారు. ఇల్లు నిశ్శబ్దమయిపోయింది. రాజీనామా యిచ్చానని నాన్న ముభావంగా వుంటున్నారు. ఇంటి దగ్గర కూర్చోడానికి చాలా బోర్‌గా వుంది. బయటికి వెళ్ళడానికి భయం.

ఆగస్టు 20.

నాన్న ఈ మధ్య పగలంతా యింటి దగ్గర కనిపించడంలేదు ఉద్యోగం మానివేసి నప్పటినుంచీ ఆయనకీ నాకూ మధ్య సరిహద్దురేఖఏర్పడింది. అమ్మనిఅడిగాను.

"సంపాదించేవాడివి యింటిదగ్గర కూర్చున్నావు. ఆయనకూడ కూర్చుంటే కుటుంబమెలా సాగుతుంది నాయనా? ఇదంతా మాఖర్మ." అమ్మగొంతు బాధ, కోపంతో నిండివుంది.

ఇంటా బయట శత్రువునయిపోయాను. నన్ను అర్థంచేసుకున్న వాళ్ళెవరూ లేరు దరిద్రుడి ఆత్మాభిమానం పొగరుగా కనిపిస్తుంది. పారిపోయే కుక్కమీద పసిపిల్లాడుకూడ రాయి విసురుతాడు.

ఆగస్టు 24.

రెండు అడ్వర్‌టైజ్‌మెంట్లు చూసి అప్లయ్‌చేశాను యూనివర్సిటీ గోల్డు మెడలిస్టుని. నా తెలివితేటలకి గుర్తింపు లభించి తీరుతుంది.

సెప్టెంబర్ 3.


హోటల్లో శ్రీహరి మిత్ర బృందంతో కనిపించాడు. "ఏమిటి విశేషాలు మాస్టారూ?" వ్యంగ్యంగా అడిగాడు

"నాకు తోడుగా మరో దౌర్భాగ్యుడ్ని పంపిస్తారని చూస్తున్నాను."

శ్రీహరి మిత్రులు అదేదో ఘనకార్యమన్నట్లు పక పక నవ్వారు. శ్రీహరి ముఖం గర్వంగా వెలిగిపోయింది."నిప్పు ముట్టుకుంటే ఏమవుతుంది?"

"మీలాంటి బంగారు తండ్రులకి నిప్పు ముట్టుకున్నా కాలదు. కాలేది మాలాంటి సామాన్యులకే. మీ వైభవాన్ని సాహసాన్ని మీసాటి మనుషులపై చూపించండి. చాలంజీగావుంటుంది. చీమల్ని చంపడానికి ఏనుగులు దండయాత్ర చెయ్యక్కర్లేదు"

శ్రీహరి బృందం నోర్మూసుకుంది.




రేపయినా వాళ్ళు పశ్చాత్తాప పడకపోరు.

సెప్టెంబరు 10.

ఇంటిదగ్గిర ఎన్నాళ్ళు కూర్చోను? ఒక ప్రయివేటు కంపెనీలో వుద్యోగ ముందని ప్రొద్దుటే వెళ్ళాను. తొమ్మిదింటికి ప్రొప్రయిటర్ వచ్చాడు. నేను వచ్చినపని చెప్పాను.

నా సర్టిఫికేట్లు చూసి నోరు వెళ్ళబెట్టి "ఇంతచిన్న ఉద్యోగానికి రావడంఏమన్నా బాగుందీ? మిమ్మల్ని అలాంటిచిన్న పనులకి వినియోగించలేను" అన్నాడు.

ఉద్యోగం అత్యవసరమని చెప్పాను. నమ్మకంగా పనిచేస్తానని చెప్పాను.

"ఇంత యిదిగా అడుగుతున్నారు కనుక మా అబ్బాయికి ప్రయివేటు చెప్పండి. బియ్యే రెండేళ్ళనుంచి డింకీ కొడుతున్నాడు. ఓ వంద రూపాయి లిస్తాను."

అంగీకరించాను. ఏదో చిన్న ఆధారముండాలి. నా ఖర్చులకి కూడ నాన్ననేమి అడగను?

అక్టోబర్ 14.

సాయంత్రం యింటికి వచ్చేసరికి వాసంతి, మామయ్య యింటిదగ్గరున్నారు. వాళ్ళెందుకు వచ్చారో అర్థమయిపోయింది.

భోజనాలదగ్గర మామయ్య పెళ్ళి విషయం కదిపాడు. నాన్నకీ అమ్మకీ వాసంతి కోడలవడం ఇష్టమే. మామయ్య కాంట్రాక్టులుచేసి బాగా సంపాదించాడు. ఘనంగా కట్నం యివ్వగలడు. ఇతర వేడుకలు జరపగలడు.

"ఉద్యోగ మొచ్చేదాకా పెళ్ళికి నాకిష్టంలేదు తర్వాత చూద్దాం" అన్నాను.

మామయ్య తొందరలో జరిగిపోవాలంటాడు. నేనంగీకరించలేను.

మామయ్య కోపంగా బుసలు కొట్టాడు.

భోజనమయ్యాక వాసంతి నాగదిలోకి వచ్చింది. యువతిలాగే వుండాలని అభిలాషపడే యువతిలాంటి సెటప్‌లో ముగ్ధంగావుంది. మామధ్య కాస్సేపు కులాసా సంభాషణం జరిగింది.

"నీకీ పెళ్ళి యిష్టంలేదా బావా?" వాసంతి ప్రశ్న.

"బంగారు పిచికవి నిన్ను కాదనగలనా?" ఆమెని దగ్గరగా తీసుకుని బుగ్గ మీద చిటికవేశాను.

వాసంతి దూరంగా జరిగింది. "మరి పెళ్ళికి వాయిదా ఎందుకు? ఉద్యోగం రాకుండా వుంటుందా? మావాళ్ళకి తొందరగా వుంది."

"నామీద నాకు నమ్మకం కలగనీ వాసంతీ ...ఇరుకు గదినుంచి విశాలమైన హాల్లోకి రానీ! అప్పటిదాకా నీకూ నాకూ సుఖంలేదు."

వాసంతిని మామయ్య పంపి వుంటాడు. లేకపోతే ఆడపిల్ల తన పెళ్ళి గురించి అంత స్పష్టంగా మాట్లాడలేదు.

అక్టోబర్ 15.

ప్రొద్దుటే మామయ్య వాసంతీ వెళ్ళిపోయారు కోపంగా. అప్పట్నుంచీ అమ్మ నన్ను సాధిస్తూనేవుంది. నేను త్త అప్రయోజకుడ్నని ఆమె భావం.

అక్టోబర్ 30.

రవివర్మ పెళ్ళికి విశాఖ వచ్చాను. పెళ్ళిలో ప్రొఫెసర్ ఛత్రపతి కనిపించారు "ఏం చేస్తున్నావోయ్?" అనడిగారు.

పరిస్థితి చెప్పాను.

"కమిటీ కాలేజీలు రాజకీయాలమీద ఆధారపడివుంటాయి. రేపు ప్రొద్దుట నాకు కనిపించు" అన్నారు వెళ్ళిపోతూ.

ఛత్రపతిగారి అభిమానానికి పులకరించిపోయాను. ఆయనవల్ల తిరిగి మంచి రోజులు వస్తాయేమో!

రవివర్మ పెళ్ళిలో పాత స్నేహితులు చాలామంది కనిపించారు. చదువులో నాకంటె వెనకబడి వుండేవారు జీవితంలో నాకంటె ముందు వున్నారు. దట్స ఫేట్!

అక్టోబరు 31.

ఛత్రపతిగారింటికి ప్రొద్దుటే వెళ్ళాను. ఆయన ఎయిర్‌పోర్టు కెళ్ళారని చెప్పాడు నౌకరు. వరండాలో పేపరుచూస్తూకూర్చున్నాను.

"మీరా .... యిక్కడున్నారేమిటి?.... యింట్లోకి రాకుండా."

తలెత్తిచూశాను. ప్రొఫెసరుగారి అమ్మాయి. మెరుపుతీగలాంటి అందం ఆమెది. ఒకటికి రెండుసార్లు చూడాలనిపిస్తుంది.

"అలా కొత్తగా చూస్తారేమిటి?రండి" తనచేత్తో నన్ను లేవదీసింది. ఆమెస్పర్శకి పులకరించి పోయినా, వాస్తవం నన్ను హెచ్చరించింది.

కాని నేనేం చెప్పినా ఆమె వినిపించుకోలేదు. డైనింగ్ హాల్లోకి తీసికెళ్ళింది. రెండేళ్ళ కుర్రాడు డెస్క్‌మీద యిడ్లీ చిదిపి పోస్తున్నాడు.

"మధు ...నాన్నగారు వచ్చార్రా .." కుర్రాడ్ని నాకందించింది.

ఈ అమ్మాయికేం పిచ్చిపట్టలేదుకదా!

ఆమె వేడివేడి యిడ్లీ నెయ్యినాముందు పెట్టింది. "తీసుకోండి....నామీద మీకింకా

కోపం పోలేదన్నమాట

నా అదృష్టంకొద్దీ యింతలో ఛత్రపతి వచ్చారు

"డాడీ యిప్పుడే వచ్చారాయన ఇంక రాడమ్మా అనేవారు. చూశారా నేనే నెగ్గాను" చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది

టిఫిన్ అయ్యాక ఛత్రపతి నేను డ్రాయింగ్ రూంలో కూర్చున్నాం

"మా దీప పిచ్చిదానిలా తయారయిందయ్యా దివాకర్ ఆర్నెల్లక్రితం యాక్సిడెంటులో పోయాడు. అప్పట్నుంచీ దీప నాకు పజిల్ అయింది. దీపని కంట్రోల్ చెయ్యడం నాకు కష్టంగానే వుంటోంది. దివాకర్ మీలాగే వుండేవాడు. అమ్మాయి నిన్ను తన భర్తనుకుంటోంది."

నా అప్లికేషన్ తీసుకున్నారు.

నవంబర్ 1.

తలుపు కొడుతూంటే మెలకువ వచ్చింది. ఛత్రపతి. ఇంతపొద్దుటే ఆయన రావడం ఆశ్చర్యం వేసి "కబురు పెడితే నేనే వద్దునుకదా సార్!" అన్నాను.

"నా పనిమీద వచ్చానయ్యా నువ్వు నిన్న వెళ్ళినప్పట్నుంచీ నా ప్రాణంతీసింది దీప! ఆయన ఎక్కడికెళ్లారు నాన్నా?" అంటూ. ఏంచెప్పను. రాత్రిదాకా ఎలాగో లాలించాను.

నాకు కెనడా విజిటింగ్ ప్రొఫెసరుగా ఛాన్సు వచ్చింది. దీపను వదలి ఎలాగ వెళ్ళడం చెప్పు? ఇన్నాళ్ళూ నా అన్నవారు




లేక దీపని ఎవరికి వదలి వెళ్ళడమా అని ఆగిపోయాను ఇప్పుడు నువ్వు దొరికావు దీపని నీకు అప్పగిస్తున్నాను."

నాకేం అర్థంకాలేదు.

"దినకర్! దీపని నువ్వు వెళ్ళిచేసుకుంటే నా భారం తప్పుతుంది నీకు బంగారమైన భవిష్యత్తు ఏర్పరుస్తాను ప్లీజ్" ఆయన నా చేతులు పట్టుకున్నారు

దీప విడో ఒక బిడ్డతల్లి నాలో సంఘర్షణ బయలుదేరింది సంప్రదాయం కాదనమంటోంది

"నాకు కొంత వ్యవధి యివ్వండి " అన్నాను తప్పించుకోడానికి

"మధ్యాన్నందాకా ఇస్తాను సరిగ్గా రెండింటికి ఒక ఫరంలో మానేజరుగా ఆర్డర్ తీసుకువస్తాను ఉపయోగించుకుంటావో లేదో నీఇష్టం"

ఛత్రపతి వెళ్ళిపోయాక రెండుకప్పుల కాఫీతాగి సీరియస్గా సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నాను

ఛత్రపతి ఎర అర్థమయింది

భార్యపోతే మగాడు పెండ్లికొడుకవుతున్నాడు అదే అవకాశం స్త్రీకి ఎందుకు లేకపోవాలి.

దీప దీపంలా వుంటుంది ముగ్గులు పెట్టిన వాకిల్లా వుంటుంది ఆమె కతో నా జీవితం నందనవనమవుతుంది

పురోగమనం మంచి ఫలితాన్నిస్తుంది లాభం వచ్చేలా జీవించడమే మంచిది

నవంబర్ 2

మానేజర్గా వుద్యోగంలో ప్రవేశించాను. నాలుగు అంకెల జీతంతోపాటు ఛత్రపతిగారి ఆస్థికి వారసుడ్నయ్యాను.

నవంబర్ 6

దేవాలయంలో పెళ్ళి జరిగిపోయింది ఉదయం. దీపకి తెలియకుండా మత్తు యిచ్చారు.

సాయంత్రం మేడమీద వరండాలో పేపరు చూస్తుంటే దీపవచ్చి "మళ్ళీ ఎక్కడికయినా పారిపోయారనుకున్నాను" అన్నది

"నిన్ను వదలకుండా గట్టి బంధమే పడింది " ఆమెను సోఫామీదికి లాగాను.

"మీవన్నీ మాయమాటలే బాబూ!"

"నీ మాయలో పడిపోయాను సిన్మా ప్రోగ్రాం పెట్టావుకదా తొందరగా తయారవ్వు మన అలంకరణకి ఆరు గంటలు కావాలి "

నేను బట్టలువేసుకుని క్రిందకివచ్చాను ఛత్రపతిగారి ప్రయాణం రేపే ప్రయాణ సన్నాహంలో వున్నారు ఆయనతో మాట్లాడుతుండగా, దీప పాలనురుగు లాంటి వెల్వెట్ శారీలో ముచ్చటగా దీప క్రిందికి వచ్చింది మధుతో


"వీడెందుకు పానకంలో పుడకలా?" విసుక్కుంటూ అన్నాను. దీప నా పస్తు వయింది మధు అన్యంగా కనిపిస్తు నాకు

"మనువు వాడ్ని తీసుకురాకపోతే ఊరే తిట్టేవారు "

దివాకర్కి కొడుకంటే ప్రాణంకాబోలు కాని నేను దినకర్ని మధుమీద అనురాగం కుదరడం కష్టం నాకు

సినిమానుంచి వచ్చేసరికి పదయింది భోజనంచేసి రేడియో వింటూ కూర్చున్నాను కాస్సేపట్లో దీప వచ్చింది తాంబూలం పళ్ళెంతో

నేను ఆకులు తీసి సున్నం రాసుకో




సాగాను దీప నవ్వుతూ "ఈ అలవాటు ఎప్పట్నుంచి?" అంటూ పళ్ళెం లాక్కుంది

"అదేం?"

"తాంబూలం తయారుచేసి యిస్తే తాంబూలంతో పాటు నా వేలుకూడ కొరికేసేవారు"

దివాకర్ అలవాటది నా మనస్సు కలుక్కుమంది సంభాషణ మారుస్తూ "ఇది తొలిరేయి కదా మనకా గొడవలన్నీ ఎందుకు?" ఆమెని కౌగిలిలో బంధించాను

"తొలిరేయేమిటండీ మీకు మతి పోతోంది" దీప బిగ్గరగా నవ్వింది కొబ్బరికోరులాంటి పళ్ళవరుసలో నవ్వు పరవశంగా వుంది

"తొలిరేయిలా వుందని" నా తప్పు తెలిపి సరిదిద్దాను

నవంబర్ 7

ఛత్రపతి మార్నింగ్ ఫ్లయిట్‌లో బయలుదేరారు దీపతో ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాను సెండాఫ్‌కి రహస్యంగా పిలిచి "దీప భారం నీదే సుమా దీప చురుకు మనిషి నువ్వే సర్దుకుపోవాలి ఇది కొంత కాలం నీకు ఇబ్బందిగానే వుంటుంది టేకిట్ ఈజీ" చెప్పారు

వాగ్దానం చేశాను

సాయంత్రం దీపతో బీచ్ కెళ్ళాను అక్కడ మంగారాం కనిపించి "హలో దినకర్" అంటూ దగ్గర కొచ్చాడు కొంచెం సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు

"మిమ్మల్ని దినకర్ అంటాడేమిటండీ దివాకర్ అయితే" దీప అడిగింది

ఏదో సర్ది చెప్పాను

సముద్రం అలలతో ఎగిసిపడుతోంది జాలరులు పడవలమీద వేట సాగిస్తున్నారు పశ్చిమ కిరణాల్లో అనంతమైన జలరాశి కన్నుల పండుగగా వుంది

"పడవ ఎక్కుదామా?" అన్నాను.

"మీతోటా .. ఒకసారి అయిందిగా సంబరం."

నేను లాలించి నెమ్మదిగా తెలుసుకున్నాను. పెళ్ళయిన కొత్తలో దివాకర్, దీప కోనసీమ వెళ్ళారు. సాయంత్రం గోదావరీ తీరానికి షికారు కెళ్ళారు. అక్కడే చిన్న పడవ వుంది. పడవవాడి కోసం చాలసేపు చూపినా వాడు రాలేదు. చివరికి యిద్దరూ పడవమీద జల విహార యాత్రకి వెళ్ళారు. కెరటాలకి పడవ తల క్రిందులయింది. దీప షాక్‌తో బిగిసిపోయింది. దివాకర్ నెమ్మదిగా ఒడ్డుకి చేర్చాడు. చీకటిపడింది.

వెన్నెల వచ్చింది తడి బట్టలతో బంధువుల యింటికి వెళ్ళలేక అక్కడే బట్టలు ఎండబెట్టుకున్నారు. ఏకాంతంలో... గోదావరి కెరటాల సంగీతం వింటూ ... వెన్నెల్లో ...చలికి ఆగలేక ... యిద్దరూ ఒకటయ్యారు.

ఇటువంటి రహస్య అనుభూతులు భార్యాభర్తల మధ్య బాగుంటాయి....నాకు మాత్రం దీపమీద అంతులేని కోపం వచ్చింది. 'ఉపయోగించిన వస్తువు' అన్న భావం గుర్తుకొస్తోంది.

నవంబర్ 10.

మధుకి జ్వరం. మందులు యిచ్చినా ఏం తగ్గలేదు. సాయంత్రం మిసెస్ కైలాసం యింటికి పార్టీ కెళ్ళాను. దీప రాదని పిలవలేదు. నేను వచ్చేసరికి దీప కాళికలా కూర్చుంది "బాబు కి ఎలా వుందని" అడిగాను.

"వాడికెలా వుంటే ఏంలెండి? మీ సరదాలు తీర్చుకు వచ్చారుకదా ...ఇంట్లో పసిపిల్లాడు అలా వుంటే యిష్టమొచ్చినట్లు తిరిగి వస్తారా?" దీప గయ్‌మంది.

మధు ఉదయం కంటె బాగున్నాడు. జ్వరం తగ్గిందికూడ.

"నౌకరుచేతమందులుపంపితేమీబాధ్యత తీరిపోయిందా?.. ఛీ .మీ రింత కర్కోటకటం మనిషనుకోలేదు .. వాడేం దారే పోయే దానయ్యకాదు.మీ కొడుకు తెల్సా?"

వాడు నా కొడుకా??? అంతరాత్మ అంగీకరించడంలేదు. దీప భార్యయినపుడు వాడేమవుతాడు???

నవంబర్ 12.

మధు పత్యం తిన్నాడు. వాడ్ని ఎత్తుకు తిరిగితేకాని దీప కోపం పోలేదు. మధు 'డాడీ' అంటూంటే అదోలా వుంది.

నవంబర్ 29.

నాన్నదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. మావయ్య పెళ్ళికి తొందర చేస్తున్నాడట. లేకపోతే నా చదువు కయ్యే బాకీ తీర్చమంటున్నాడుట. హాస్తవం రాస్తే వాళ్ళు భరించలేరు.

డిశంబర్ 2.

ఇంటికి వెళ్ళిరావాలి. లేకపోతే పరిస్థితి తారుమారవుతుంది. ఆఫీసులో పని తెమలడం లేదు ..

డిశంబర్ 5.

సాయంత్రం యింటికి వచ్చేసరికి ముసలయ్య మధుని ఆడిస్తున్నాడు. "అమ్మగారు క్లబ్‌కెళ్లారండి ..భరతనాట్యం చేస్తారట... " అన్నాడు ముసలయ్య.

నేను క్లబ్‌కెళ్ళేసరికి చీకటి పడింది. ఆహూతులతో సభ నిండివుంది. దీప నాట్యాన్ని అందరూ వూపిరి బిగపట్టి చూస్తున్నారు. నా మనస్సు కళమీద లేదు.

స్వార్థంమీద వుంది. నాకు చెందిన వస్తువు అలా నలుగురి ముందూ ప్రదర్శనివ్వడం యిష్టంలేక పోయింది.

"ఇక నువ్వు నాట్యం చెయ్యకూడదు" ఇంటికి రాగానే అన్నాను.

"మీవన్నీ కళాకళలు. మీ పోరు మీదే నేర్చుకున్నాను...."


మళ్ళీ దివాకర్ ప్రసంగం వచ్చేసింది. ఆమె నా భార్యగా కనిపించడం లేదు. పరాయి సొత్తనిపిస్తోంది.

"నాకోసం నేర్చుకున్నావ్....నాకోసం మానెయ్."

దీప ఏడుస్తూ పడుకుంది.

డిశంబర్ 10.

వంట్లో బాగోలేక మధ్యాన్నం లంచ్‌కి వచ్చేశాను. నాన్ననిచూపి బిగిసిపోయాను. అదృష్టవశాత్తు వుదయం దీప శ్రీకాకుళం పెళ్ళికి వెళ్ళింది. ముసలయ్యవల్ల అంతా తెలుసుకుని మండిపడ్డారు. "వంశాన్ని మంట గలిపావురా అప్రాచ్యపుకుంకా.... వెధవముండ నా కోడలుట్రా....ఛీ....నీ యింట గంగ ముట్టినా పాపమే ..." నేనేం చెప్పినా ప్రయోజనం లేకపోయింది. ఆయనది పాత రక్తం. కొత్త మార్పుని సహించలేదు. "డబ్బుకోసం కక్కుర్తి పడ్డ వెగవ్వి .... నీకూ మాకు సంబంధం

లేదు...." అని వెళ్ళిపోయారు.

డిశంబర్ 18.

దీపని అర్థం చేసుకోవడం కష్టమే అవుతోంది. ఆమెకు గతమంటే చాల యిష్టం. ఏదో సందర్భంలో గతాన్ని చెబుతూనే వుంటుంది. దివాకర్ ప్రసక్తి వస్తే భరించలేకపోతున్నాను.

జనవరి 7.

దీప పుట్టినరోజు. తొందరగా యింటికి వెళదామని ప్రయత్నించాను. కుదరలేదు. దీప రెండుసార్లు ఫోన్ చేసింది ఆఫీసుకి.

నేను తెచ్చిన ప్యాకెట్లన్నీ దీప విసిరి పడేసింది. "మీకు నాకంటె ఆఫీసే ముఖ్యం" అంటూ.

నా తప్పులన్నీ బుద్ధిగా అంగీకరించాను. "ఏ శిక్ష విధించినా సిద్ధమే."

దీప లోపలకెళ్ళి టిఫిన్ తీసుకు వచ్చింది. "మీ కిష్టమని కజ్జికాయలు చేశాను."

నేను కాదనలేక ఒకటి తిన్నాను. కజ్జికాయలు నాకు సహించవు. దీప ఆశ్చర్యంగా చూస్తూ "ఎప్పుడుచేసినా డబ్బా లాగించేసేవారు? ఏంవచ్చింది?" అన్నది.

మళ్ళీ దివాకర్ ప్రశక్తి వచ్చేసింది. నా వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ అనుక్షణం దివాకర్ని అనుసరిస్తూ వుండాలి. దీపకి నేను భర్తనికాను....దివాకర్.... దివాకర్....

దీప బలవంతంగా నోట్లో పెట్టింది. పుట్టినరోజున ఆమెని నొప్పించలేక "ఆరోగ్యం బాగాలేదు దీపా" అన్నాను లోపలికెళుతూ.

ఫిబ్రవరి 1.

వాసంతి శుభలేఖ అందింది....పొరపాటు చేశాననిపించింది. వాసంతిని చేసుకుంటే జీవితం క్రమపద్ధతిలో ముందుకు సాగేది. ఈనాడు నేను ఎదిగిపోయినా, మానసికంగా దారుణంగా బాధపడుతున్నాను. సాంసారికంగా ఏకాకిని.

మామయ్య కివ్వవల్సిన ఎనిమిదివేలు పంపేశాను.

ఫిబ్రవరి 23.

దీప స్నేహబృందంతో భీమ్లి పిక్నిక్ కెళ్ళింది. ఆరోగ్యం బాగాలేక యింటి దగ్గరే వుండిపోయాను. సాయంత్రందాకా పుస్తకాలతో కాలం గడిచిపోయింది. బుక్రాక్ వెతుకుతూంటే నీలంరంగు ఫైలు కనబడింది. యాభై కిపైగా వున్నాయి కాగితాలు.

ప్రేమలేఖలు ...దీప....దివాకర్.

ఇద్దరికీ కాలేజీలోనే పరిచయమయింది. దివాకర్ ఏకాకి. అతడి తెలివి తేటలుచూసి ఛత్రపతి సాయంచేశారు. ఇంటికి వస్తూండేవాడు.

దీపరాసిన వుత్తరంమీద నా దృష్టి నిలిచిపోయింది.

"దివా....నువ్వు విశాఖ ఎప్పుడు వస్తావ్? అర్జంటుగా నువ్వు నాన్నగారిని కల్సుకోవాలి. మనం గెస్టు హౌస్లో గడపిన రాత్రులు నాకు తీర్పుని చెబుతున్నాయి. డాక్టర్ని కల్సుకుంటే 'ప్రెగ్నంట్' అని చెప్పింది. తొందరగా మన పెళ్ళి జరిగిపోవాలి...."

నాలో సెగలు పొగలు రేగినయ్. పెళ్ళికి ముందే చాలకథ నడిచిందన్నమాట ....పురోగమనంకోసం ఎన్నుకున్న దారి

ఎంత భయంకరమైనది? దీప గతాన్ని తుడిచివేసుకునే విశాలత్వముందా?

దీప ఎప్పుడు వచ్చిందో....నా ప్రక్కన కూర్చుంది. "తీరిగ్గా ప్రేమ లేఖలు చదువుతున్నారేమిటి?" నా వొడిలోవున్న వుత్తరాలు అందుకుంది.

నా మనస్సు అగ్నిగోళంగా వుంది. ఇదే దివాకర్-దీప అయితే మధుర స్మృతులతో పరవశించేవారు. లైటర్‌తో కాగితాలు అంటించాను. "అదేం?" దీప విస్మయపడింది.

"నోర్మయ్ ." గద్దించాను.

ఫిబ్రవరి 24.

మానసిక ఆందోళన అనారోగ్యాన్ని యిచ్చింది. హెవీ టెంపరేచర్. దీప నా మంచం దగ్గరే వుంటోంది. ఆమెని చూస్తే మనస్సు భగ్గుమంటోంది.

మార్చి 1.

జ్వరం కంట్రోల్ అయింది. ఇంకా రెండు రోజులయినా ఆగాలి పత్యానికి. నా సేవలో దీప అలసిపోయింది. అజ్ఞాతంగా ఆమె మీద కపి నాలో చావలేదు.

మార్చి 3.

పత్యం తిన్నాను. దేహికంగా ఆరోగ్యం పొందాను. మధ్యాహ్నం నిద్ర రాకుండా చందమామ చదువుతూ కూర్చున్నాను. భోజనం చేసి దీపవచ్చి మంచం మీద కూర్చుని "ఈ సారి జ్వరంలో మీకు విపరీతమైన కోరికలేం రాలేదు బాబూ....బ్రతికాను" అంది.

"క్రితంసారి ఏమి వచ్చింది?" అన్నాను లాలనగా.

దీప సిగ్గుపడింది...."నేను చెప్పను బాబూ" అంది. నేను బుజ్జగించాను. దీప గోడమీద ఫోటోచూపి "అలా వుండమని చంపేశారు....ఏం కోరికలో బాబూ...." అన్నది.

వెన్నెట్లో నగ్నంగా నిలబడ్డ అభిసారిక ఫోటో అది. కుతకుతలాడిపోయాను. దివాకర్ ఈమెలోని అణువణువు శోధించి వుంటాడు....అన్వేషించివుంటాడు.

"ఫో...." దీపని మంచం మీదనుంచి తోపివేశాను కోపంగా.

ఏప్రియల్ 4.

బయిటే ఎక్కువ గడుపుతున్నాను.... దీపని భార్యగా భరించలేకపోతున్నాను.

ఏప్రియల్ 10.

ప్రతిమార్పు ఒక ప్రయోగం. కాల గతికి నిలబడటమే పరీక్ష. ప్రతీ సంపద వెనుక ఒక రకమైన సంస్కృతి వుంటుంది. సంపదని ఆశించేవారు సంస్కృతినీ భరించాలి.

ఏప్రియల్ 15.

వర్తమానం నిప్పులగుండంలా వుంది ఎక్కడికో పారిపోవాలనివుంది? ఆకలి కేకలు భరించడానికయినా సిద్ధమే....రాజీ పడలేను! అటా? ఇటా? ఏం చెయ్యాలి? ఏ దారి ఎన్నుకుని గమ్యం చేరుకోవాలి? ఏం చెయ్యమంటారు?

[ఇది పూర్తి జీవితం కాదు. జీవితంలో ఓ భాగం. అలాంటప్పుడు ఏదో ముగింపుని ఏర్పరచడం వాస్తవాన్ని చంపివేయడమే. జీవితానికి అందులో వ్యక్తి సాగిస్తున్న అన్వేషణకి స్పష్టమైన ధ్వని రావాలని డైరీ పద్ధతిలో రాశాను. కాని ఇది ముగింపులేని కథకాదు. ఆద్యంతాలున్నాయి. ఏం చెయ్యాలో చెయ్యకూడదో చెప్పబడింది. దాన్ని పాఠకులు గ్రహించాలని క్రాస్‌రోడ్‌లో ఆపివేశాను. వైవిధ్యం కోరేపాఠకులకి ఈ ప్రయత్నం నచ్చుతుందని ఆశిస్తున్నాను.

రచయిత]